క్లుప్తంగా

పలువురికి ఎమ్మెల్యే పరామర్శ



అప్పలరాజును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్ తదితరులు

సబ్బవరం: ఇటీవల విద్యుత్ పోల్ పడి గాయపడ్డ పైడివాడ అగ్రహారం సర్పంచ్ వద్దాది అప్పలరాజును స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆదివారం పరామర్శించారు. త్వరలో పూర్తిగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే ఇటీవల పాము కాటుకు గురైన ఇరువాడకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బంగారు నాయుడును కూడా ఎమ్మెల్యే పరామర్శించారు. ఎమ్మెల్యేతో పాటు బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కొటాన రాము, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాల నాయుడు, పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, మోపాడ అప్పారావు,కాపుశెట్టి శేషుబాబు, కర్రి అప్పారావు తదితరులు ఉన్నారు.

బొడ్డేడకు అభినందన



బొడ్డేడకు శుభాకాంక్షలు తెలుపుతున్న రాష్ట్ర సీఈసీ సభ్యుడు శ్రీనివాసరావు

పరవాడ: అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన బొడ్డేడ ప్రసాద్‌కు రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, పెందుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు పైల అప్పలనాయుడు ఉన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన



ప్లకార్డులతో ర్యాలీ చేస్తున్న బాబూరావు తదితరులు

సింహాచలం: ప్లాస్టిక్‌ను నిషేధించాలని, పర్యావరణాన్ని కాపాడాలని గిరిప్రదక్షిణలో ఏపీ నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. గోపాలపట్నం ప్రభుత్వ హైస్కూల్ జీవశాస్త్రం ఉపాధ్యాయుడు, ఏపీ నేషనల్ గ్రీన్ కార్ప్స్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్.బాబురావు ఆధ్వర్యంలో విద్యార్థులు అవగాహన కల్పించారు. భక్తులకు ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను తెలిపారు. చెట్లను నరికివేయడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు.

నవ్వులు పూయించిన కామెడీ స్కిట్లు



స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు

సీతంపేట: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన వినోదాల విందు కామెడీ షో ఆద్యంతం నవ్వులు పూయించింది. కామెడీ ఆర్టిస్టులు జబర్దస్త్ ప్రకాష్, ఎం.వి.సుబ్రహ్మణ్యం, రావి గోపీకృష్ణ, భానుప్రకాష్, శివజ్యోతి, అన్వేష, దామోదర్, ఇమంది ఈశ్వరరావు, జి.వి.త్రినాథ్, బుగత సత్యనారాయణ, శ్రీధర్, పుష్యమి, మల్లిక, పోర్టు శేషులు ప్రదర్శించిన స్కిట్లు కడుపుబ్బా నవ్వించాయి. ఫోన్ చేసి మరీ అడగాల, కుక్క కరిచింది, కుక్కను అమ్మేస్తా, రక్తం, ఆర్టీసీ బస్సు, ఎఫ్4, స్కిట్స్ ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తాయి. ఈ సందర్భంగా కళాకారులను నండూరి రామకృష్ణ, ఎ.వి.రామకృష్ణ, దాసరి సాంబశివరావు తదితర అతిథులు సత్కరించారు.

వెంకన్న ఆలయంలో గిరి ప్రదక్షిణ

ఉక్కునగరం: సెక్టార్–1 వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం గిరి ప్రదక్షిణ జరిగింది. పౌర్ణమి సందర్భంగా సాయంత్రం ఆరు గంటలకు ఏర్పాటు చేసిన గిరి ప్రదక్షిణ ఆద్యంతం గోవింద నామస్మరణతో మార్మోగింది. ఆలయ అర్చకులు భావనారాయణస్వామి, హరినారాయణ స్వామి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



బిర్యానీ పంపిణీ చేస్తున్న రాఘవేంద్ర ట్రేడర్స్ సిబ్బంది

- వృద్ధులకు పాదసేవ
- అల్పాహారం, మజ్జిగ, ఇతర పానియాల పంపిణీ



పులిహోర పంపిణీ చేస్తున్న దృశ్యం



ప్రశాంతినగర్‌కు చెందిన నానిబాబు బృందం ఆధ్వర్యంలో..

గిరి భక్తుల సేవలో స్వచ్ఛంద సంస్థలు

సింహాచలం: సింహగిరి ప్రదక్షిణకు తరలి వచ్చిన భక్తులకు దారిపొడవునా విశేష సేవలు లభించాయి. పలు స్వచ్ఛంద సేవా సంస్థలు, సంఘాలతో పాటు వ్యక్తిగతంగా ఆహారపదార్థాలు, పానియాలు, ప్రసాదం, టిఫిన్స్, చాక్లెట్లు, టీ, బిస్కట్లు తదితర వాటిని విరివిగా అందజేశారు. భక్తుల సేవలో తరించారు. పాత అడవివరం కూడలి నుంచి పైనాపిల్ కాలనీకి వెళ్లే మార్గంలో శ్రీ రాఘవేంద్ర ట్రేడర్స్ ఆధ్వర్యంలోబిర్యానీ, ఉప్మా, శనగలు, టీ అందజేశారు.

- హైదరాబాద్‌కు చెందిన కందాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులకు టిఫిన్ అందజేశారు. ఇందుకోసం హైదాబాద్ నుంచి ప్రత్యేక వంట బృందాన్ని తీసుకొచ్చారు. వెయ్యి కిలోల పిండిని వాడారు.
- విజయనగరానికి చెందిన హనుమాన్ పీఠం ఆధ్వర్యంలో బిస్కెట్లు, ఉత్తరాంధ్ర నర్సరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ, రైతుమిత్ర ఆధ్వర్యంలో శనగలు, పులిహోర, పరమాన్నం, చక్కెర పొంగలి అందజేశారు.
- దారపాలెంలో శ్రీనివాస్ అండ్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో ఉప్మా, పెందుర్తి ప్రశాంతినగర్ నిర్వాసితుల ఆధ్వర్యంలో పులిహోర, పొంగలి, పెరుగు అన్నం పంపిణీ చేశారు.
- చినముషిడివాడకు చెందిన ఎస్ఎస్ఎస్ హోమ్స్ ఆధ్వర్యంలో గ్లూకోజ్ వాటర్ అందజేశారు.

వృద్ధులకు పాదసేవ

గిరిప్రదక్షిణలో కాళ్ల నొప్పులు పుట్టి నడవలేని వారికి దారపాలెం వద్ద పాదసేవ చేశారు. ఇందుకోసం పలువురు సిబ్బందిని నియమించారు. వీరంతా వృద్ధులను కుర్చీల్లో కూర్చోబెట్టి పాదపూజ చేశారు. మాత్రలు అందజేశారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

గిరిప్రదక్షిణలో దేవస్థానం పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేసింది. విజయనగరానికి చెందిన పులివేషాలు, తప్పెటగుళ్లు ఆకట్టుకున్నాయి. అలాగే కాంతారా నృత్యాలు, కాళీ వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కోలాట బృందాలు పెద్ద ఎత్తున నృత్యాలు చేశాయి.



రైతుమిత్ర ఆధ్వర్యంలో శనగలు, పులిహోర పంపిణీ



బిస్కెట్లు , టీ పంపిణీ చేస్తున్న విజయనగరానికి చెందిన కల్లూరు శ్రీనివాస్ బృందం



బోండాలు పంపిణీ చేస్తున్న హైదరాబాద్‌కు చెందిన కందాల శ్రీనివాస్ బృందం



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఉత్తరాంధ్ర నర్సరీ అసోసియేషన్ ప్రతినిధులు

ఘనంగా మరిడిమాంబ పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, కార్పొరేటర్ ముమ్మన

సింహాచలం: జీవీఎంసీ 95వవార్డు పరిధి వరలక్ష్మినగర్‌లో కొలువై ఉన్న పసుపులమ్మ మరిడిమాంబ పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, 95వవార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గంట్ల నర్సింహమూర్తి, బొడ్డు దేముడుబాబు, అప్పికొండ రాంబాబు, లక్ష్మి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

సత్ప్రవర్తనతో మెలగండి

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ధర్మేంద్ర మాట్లాడుతూ నేరాల జోలికి పోకుండా సత్ప్రవర్తనతో మెలగాలని రౌడీషీటర్లకు పలు సూచనలిచ్చారు. ఎటువంటి తగాదాలు, గొడవల్లో తలదూర్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా జీవించాలని హితవు పలికారు. అనంతరం రౌడీషీటర్లను వారి ఇళ్ల వద్ద పోలీసులు అప్పగించారు.

ఫోర్త్ టౌన్ పీఎస్‌లో..

ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీ షీటర్లకు ఎస్ఐ వెంకటరావు కౌన్సెలింగ్ నిర్వహించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. ఎటువంటి నేరాలు జోలికి పోవద్దన్నారు.

వైద్య సేవలపై డీఎంహెచ్‌వో ఆరా



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: సింహాచలం గిరి ప్రదక్షిణకు వచ్చే భక్తులకు వైద్య సేవలు అందించడానికి వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో 31 వైద్య బృందాలను ఏర్పాటు చేశారు.16 అంబులెన్సులను అందుబాటులో ఉంచారు. గిరి ప్రదక్షిణ జరిగే 32 కిలోమీటర్ల పొడవునా ఆదివారం ఉదయం 8 నుంచి సోమవారం సాయంత్రం ఆరు గంటల వరకు వైద్య బృందాలు సేవలందిస్తాయని డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు చెప్పారు. సింహాచలం దేవస్థానం బస్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. వైద్యులు,సిబ్బందితో మాట్లాడారు. భక్తజనానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

ఉద్యమాలకు ప్రేరణ.. ‘ది మ్యాంగో లేడీ’



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జ్యోతి, ఆచార్య కె.ఎస్.చలం తదితరులు

సీతంపేట: ఉద్యమాలకు ప్రేరణ ఇచ్చే నవల ‘ది మ్యాంగో లేడీ’ అని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. హిందూ దినపత్రిక సబ్ ఎడిటర్ మల్లాజోస్యుల అనుపమ పద్మజ రచించిన ది మ్యాంగో లేడీ ఇంగ్లిష్ నవల పుస్తకావిష్కరణ సభ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. సోంపేట పోరాట యోధురాలు జ్యోతి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఏయూ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎం.నళిని పుస్తకాన్ని సభకు పరిచయం చేశారు. ద్రవిడ యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య కె.ఎస్.చలం, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి జి.మురళి, రచయితలు అట్టాడ అప్పలనాయుడు, శ్రీనివాసులు ప్రసంగించారు. ఉత్తరాంధ్ర వర్తమాన, సామాజిక జీవితపు వాస్తవ చిత్రీకరణ ఈ నవలలో రచయిత్రి చక్కగా పొందుపర్చారని, ఉద్యమాలకు ప్రేరణగా తోడ్పడుతుందని వక్తలు పేర్కొన్నారు.

విశాఖను పరిపాలన రాజధానిగా సాధించుకుందాం

దాబాగార్డెన్స్ : విశాఖను పరిపాలన రాజధానిగా సాధించుకుందామని ఉత్తరాంధ్ర రాష్ట్రీయ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాజుగౌడ్ పిలుపునిచ్చారు. స్థానిక యువతకు (ఉత్తరాంధ్ర) 85 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని, విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమితి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో రాజు గౌడ్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర పోరుబాటను ప్రతి పల్లెకు, గ్రామానికి తీసుకెళ్లి, ఉత్తరాంధ్ర ప్రజలను చైతన్య పరుస్తామన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలు పెత్తనం సాగించే రోజు తీసుకు వస్తామన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి కావాలంటే స్థానికులు అధికారం చేపట్టడమే శరణ్యమన్నారు. తెలంగాణ తరహాలో స్థానిక యువతకు విద్య, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల్లో 85 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో స్థానిక అభ్యర్థులనే అన్ని రాజకీయ పార్టీలు అభ్యర్థులుగా ప్రకటించాలన్నారు.

వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలి



రామ్మోహన్‌రావును సత్కరిస్తున్న నాయకులు

మద్రిపాలెం: వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వాలు కృషి చేయాలని ఏఐబీసీఎఫ్ జాతీయ కార్యదర్శి ఆల్మన్‌రాజు అన్నారు. ఈ మేరకు 51వ వార్డు మాధవధార వుడా కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం అఖిల భారత వెనుకబడిన తరగతుల సమాఖ్య, అంతర్జాతీయ మానవహక్కుల సంఘం ఆంధ్రప్రదేశ్ శాఖతో సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సదస్సులో జాతీయ స్థాయిలో వెనుకబడిన తరగతుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. అనేక జాతీయ అంశాలపై తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ బీసీ జనగణన కులాల వారీగా చేపట్టాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని తీర్మానించామన్నారు. సమాజంలో 52 శాతానికి పైగా ఉన్న బీసీలను నిర్లక్ష్యం చేస్తే రాజకీయ పార్టీలకు మనుగడ లేకుండా చేయాలన్నారు. జాతీయ స్థాయిలో ఈబీసీ, ఎంబీసీ కుల గణన వంటి అంశాలను లేవనెత్తుతూ రాజీలేని పోరాటం చేస్తున్న ఆల్ ఇండియా బీసీ ఫెడరేషన్ నాయకత్వంలో బీసీ ఉద్యమం మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీసీలకు జనాభా ప్రాతిపదికన ప్రోత్సహించిన రాజకీయ పార్టీలను మాత్రమే ఆదరించాలని కోరారు. అనంతరం అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పప్పల రామ్మోహన్‌రావును ఏఐబీసీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు జస్టిస్ వి.ఈశ్వరయ్య పంపిన ఉత్తర్వులను ఆల్మన్‌రాజు అందజేశారు. అనంతరం రామ్మోహన్ మాట్లాడుతూ బీసీల సమస్యలపై జాతీయ స్థాయిలో రాజీలేని పోరాటం చేస్తున్న యోధుడు జస్టిస్ ఈశ్వరయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం పాల్గొన్నారు.

ఉద్యమాలకు ప్రేరణ.. ‘ది మ్యాంగో లేడీ’

సీతంపేట: ఉద్యమాలకు ప్రేరణ ఇచ్చే నవల ‘ది మ్యాంగో లేడీ’ అని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. హిందూ దినపత్రిక సబ్ ఎడిటర్ మల్లాజోస్యుల అనుపమ పద్మజ రచించిన ది మ్యాంగో లేడీ ఇంగ్లిష్ నవల పుస్తకావిష్కరణ సభ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. సోంపేట పోరాట యోధురాలు జ్యోతి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఏయూ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎం.నళిని పుస్తకాన్ని సభకు పరిచయం చేశారు. ద్రవిడ యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య కె.ఎస్.చలం, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి జి.మురళి, రచయితలు అట్టాడ అప్పలనాయుడు, శ్రీనివాసులు ప్రసంగించారు.

అప్పన్నను దర్శించుకున్న పరిశ్రమల శాఖ కమిషనర్



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న ప్రవీణ్‌కుమార్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం రాష్ట్ర పరిశ్రమల శాఖ కమిషనర్ ప్రవీణ్ కుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. వారి పేరిట అర్చకులు స్వామికి పూజలు చేసి వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని అధికారులు అందజేశారు.

గిరిప్రదక్షిణ భక్తులకు వైద్య సేవలు



భక్తుడికి బీపీ చెక్ చేస్తున్న డాక్టర్ కర్రి స్వామి

సింహాచలం: గిరిప్రదక్షిణ పురస్కరించుకుని ఆదివారం నగరంలోని ఆయుష్మాన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో అడవివరంలోని పాత గోశాల జంక్షన్ వద్ద ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యుడు డాక్టర్ కర్రి స్వామి నేతృత్వంలో భక్తులకు వైద్య సేవలు అందించారు. బీపీ చెక్ చేశారు. అలాగే మందులు ఉచితంగా అందజేశారు. 24 గంటల పాటు భక్తులకు వైద్య సేవలు అందిస్తున్నట్టు డాక్టర్ కర్రి స్వామి పేర్కొన్నారు.

ఎన్టీపీసీ కారిడార్ రహదారికి మోక్షం



రోడ్డు నిర్మాణానికి వేసిన మెటల్



ఎన్టీపీసీ కారిడార్ రోడ్డును అభివృద్ధి చేస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ కారిడార్ రహదారికి మోక్షం లభించింది. మరమ్మతులతో మూలుగుతున్న ఎన్టీపీసీ రహదారి శీర్షికతో ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి ఎన్టీపీసీ అధికారులు స్పందించారు. సింహాద్రి నుంచి ఏర్పాటు చేసిన కారిడార్ రహదారిపై భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు శిథిలావస్థకు చేరి పెద్ద గుంతలు పడ్డాయి. రహదారి గుంతలమయంగా మారడంతో ఎన్టీపీసీ, హిందూజా పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, ఉద్యోగులు అవస్థలు పడుతుండేవారు. అలాగే వాడచీపురుపల్లి, దలాయిపాలెం, కలపాక, పిట్టవానిపాలెం ప్రాంతాల ప్రజలు రోడ్డులో ప్రయాణించడానికి ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికుల అవస్థలను గుర్తించిన సంస్థ అధికారులు గుంతలు పడిన కారిడార్ రహదారికి మరమ్మతులు చేపట్టడానికి ముందుకు వచ్చారు. రోడ్డును బీటీ రోడ్డుగా తీర్చిదిద్దడానికి చర్యలు చేపట్టారు. ప్రస్తుతం నిర్మాణ పనులు జోరుగా సాగుతుండడంతో ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి ఆలయంలో హారతి కార్యక్రమం



మాట్లాడుతున్న ధర్మ ప్రచారక్ వెన్నల అప్పలనాయుడు

సబ్బవరం: మండలంలోని ఇరువాడ రామాలయంలో సమరసతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మండల సమావేశం నిర్వహించారు. సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ వెన్నల అప్పలనాయుడు మాట్లాడుతూ దేవాలయం కేంద్రంగా హారతి నిర్వహించాలని, వారానికి ఒకసారి భజన చేయాలని సూచించారు. గ్రామంలోని ప్రజలందరినీ భాగస్వామ్యం చేస్తూ ఇంటింటా ధర్మ ప్రచారం, నెలకు ఒకసారి నగర సంకీర్తన ఏకాదశి రోజు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల మహిళా కన్వీనర్ రెడ్డి రమణమ్మ, ఎం. రమణమ్మ,కనకమ్మ,సూర్యకాంతం,సత్యవతి,మండల కన్వీనర్ అనకాపల్లి వెంకట రమణ,సహ కన్వీనర్, దాసరి రాము,మద్దాల శ్రీను,దాడి లక్ష్మణరావు,దార త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

బదిలీల్లో జీవో32 అమలు చేయాలి

మహారాణిపేట : వైద్య ఆరోగ్యశాఖలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఉద్యోగుల సర్దుబాటు ప్రక్రియలో జీవో 32ను తప్పనిసరిగా అమలు చేయాలని జిల్లా ఎన్జీవో సంఘం అధ్యక్షుడు కె.ఈశ్వరరావు కోరారు. ఆదివారం కలెక్టరేట్ సమీపంలోని ఎన్జీవో హోంలో వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు, రేడియోగ్రాఫర్లు, హెడ్ నర్సుల జీత భత్యాల చెల్లింపులో సమస్య వచ్చే అవకాశం వుందని, దానిని తక్షణం పరిష్కరించాలని ఆయన కోరారు. ప్రతి పీహెచ్‌సీకి ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, నైట్ వాచ్‌మేన్‌ను నియమించాలన్నారు. ఎన్జీవో రాష్ట్ర నాయకత్వం ద్వారా ఈ సమస్యలను ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ సమావేశంలో ఎన్జీవో సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.రవిశంకర్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

నేవీ ఉద్యోగి అదృశ్యం



అదృశ్యమైన ధీరజ్‌కుమార్

మల్కాపురం: ఓ యుద్ధనౌకలో సెయిలర్‌గా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి అదృశ్యం అయ్యాడు. తూర్పు నౌకాదళం విభాగంలో ఎస్ఎస్ఎస్ వీరబాహు నౌకలో పంజాబ్ రాష్ట్రానికి చెందిన ధీరజ్‌కుమార్ (28) ఈ ఏడాది జనవరిలో సెయిలర్‌గా (ఆర్ఎంఎస్ ర్యాంక్) చేరాడు. వీరికి ఆ నౌకలోనే భోజనం, వసతి సదుపాయం వంటివి అధికారులు కల్పిస్తారు. విధులు అనంతరం ప్రతి రోజు సాయంత్రం వీరు అవుట్ పాస్‌పై బయటకు వెళ్లి రాత్రి 8 గంటలకు తిరిగి వస్తుండేవారు. ధీరజ్ శనివారం సాయంత్రం విధులు ముగించుకొని అవుట్ పాస్‌పై బయటకు వెళ్లి తిరిగిరాలేదు. తోటి సిబ్బంది ద్వారా సమాచారం తెలుసుకున్న అధికారులు అతడి ఆచూకీ కోసం నౌకాపరిసర ప్రాంతాలు పరిశీలించారు. ఫలితం లేకపోవటంతో ఆదివారం నేవీ లెఫ్టినెంట్ కమాండర్ సుశీల్ ఉద్యోగి అదృశ్యంపై ఫిర్యాదు చేశారు. మల్కాపురం ఎస్ఐ దేవుడమ్మ ఎస్ఎస్ఎస్ సింధూకేసరి నౌక వద్దకు వెళ్లి పరిశీలించారు. అక్కడ ఇన్, అవుట్ గేట్ల వద్ద గల సీసీ పుటేజీలను పరిశీలించారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

దాడులను నిరసిస్తూ క్రైస్తవుల ర్యాలీ

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం రక్షణగిరి రహదారిలో సెయింట్ పీటర్స్ స్త్రీల కమిషన్ ఆధ్వర్యంలో మణిపూర్‌లో జరుగుతున్న మారణకాండకు, క్రైస్తవులపై దాడులకు ఆదివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. సెయింట్ పీటర్స్ విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాశ్, సిస్టర్ సంగీత నేతృత్వంలో జ్ఞానాపురం గ్రామ మహిళలు సెయింట్ పీటర్స్ చర్చి నుంచి ర్యాలీ చేపట్టారు. అనంతరం రక్షణగిరి ముఖద్వారం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో మాట్లాడారు. క్రైస్తవులపై దాడులు అమానుషమన్నారు. వారికి రక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో స్త్రీల కమిషన్ అధ్యక్షురాలు జీఎల్ రాణి, ఉపాధ్యక్షురాలు స్వర్ణలత, కార్యదర్శి పి.వేళాంగిణి, కోశాధికారి అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.